
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
బుధవారం 13 ఆగస్టు 2025



నేడు జగిత్యాలలో మంత్రి పొన్నం పర్యటన

జగిత్యాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించనున్నట్లు జగిత్యాల కాంగ్రెస్ పార్టీ వర్గాలు ప్రకటించాయి. జిల్లా కేంద్రంలో బైపాస్‌రోడ్డు వైపున గల గొల్లపల్లి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సర్దార్ పాపన్న విగ్రహా ఆవిష్కరణలో పాల్గొంటారని తెలిపారు.

ఇందిరమ్మ మోడల్‌గృహం పరిశీలన

భీమారం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ గృహాన్ని ఎంపీడీవో నీరజ నాయకులతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకోవాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు బక్కూరి నరేష్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

జగిత్యాలఅర్బన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన రెహాన్ నరాల బలహీనతతో బాధపడుతుండగా అతని వైద్యానికి రూ.3.30 లక్షల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మంగళవారం అందించారు. షేక్ సలీం కుమారుడైన రెహాన్ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.



‘రైతు బీమా’కు నేడే ఆఖరు

- జిల్లాలో ఇప్పటి వరకు 1,48,005 మంది నమోదు
- 12,344 మంది కొత్త పట్టాదారులు
- నూతనంగా వచ్చిన దరఖాస్తులు 1,200

జగిత్యాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రైతు బీమా పథకానికి సంబంధించిన దరఖాస్తు గడువు బుధవారంతో ముగియనుంది. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని అమలు చేస్తోంది. బీమా పథకానికి సంబంధించిన ప్రీమియం డబ్బులను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తోంది. ప్రమాదవశాత్తు రైతుమరణిస్తే అతడి కుటుంబసభ్యులకు రూ.5లక్షల ఆర్థికసాయం అందజేస్తోంది. ఈ పథకానికి జిల్లాలో ఇప్పటి వరకు 1,48,005 మంది రైతులు నమోదు చేసుకున్నారు. జిల్లాలో సుమారు 12,344 మంది కొత్త పట్టాదారులున్నట్లు వ్యవసాయశాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఏడేళ్ల వ్యవధిలో పలువురు రైతులు ప్రమాదవశాత్తు మరణించగా, ప్రభుత్వం వారి కుటుంబ సభ్యులకు బీమా డబ్బులు అందించింది. పట్టాదారు పాస్ పుస్తకం ఉన్న ప్రతి రైతుకు బీమా వర్తించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

● మరో 5 వేల మందికి పైగా..

జిల్లాలోని ఆయా ప్రాంతాల్లోగల 71 రైతు వేదికల్లో బుధవారం వరకు రైతుబీమా దరఖాస్తులు స్వీకరించనున్నారు. సోమవారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభంకాగా వ్యవసాయాధికారులు బీమా దరఖాస్తుల సేకరణలో బిజీ బిజీగా ఉన్నారు. దరఖాస్తు చేసుకోవాలని ఇప్పటికే ఏఈ వోలు వివిధ మాధ్యమాల ద్వారా గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. కాగా ప్రభుత్వం ఈనెల 8వతేదీన దరఖాస్తుల స్వీకరణకు సర్క్యులర్ జారీ చేసింది. శని, ఆదివారాలు రెండు రోజులు సెలవులు కావడంతో బీమాకు దరఖాస్తు చేసుకునేందుకు రైతులకు వీలు కలగలేదు. కాగా బుధవారం ఒక్క రోజు మాత్రమే గడువు మిగిలింది. ఈసారి 3వేల నుంచి 5వేల మంది రైతుల కొత్తగా రైతు బీమాకు దరఖాస్తు చేసుకునే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. వీరితో పాటు ఇప్పటివరకు నమోదు చేసు కోని వారినుంచి కూడా దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న రైతు నామినిపేరు మార్పుచేసుకునే అవకాశమూ కల్పించినట్లు అధికారులు చెబుతున్నారు.

● బీమా అర్హతలు

రైతు బీమా దరఖాస్తుకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. దరఖాస్తు చేసుకునే రైతులు 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల్లోపు ఉండాలి. 1966 ఆగస్టు 13వ తేదీ నుంచి 2007ఆగస్టు 14వ తేదీ మధ్య జన్మించి ఉండాలి. పుట్టిన తేదీ నిర్ధారణకు ఆధార్‌కార్డు మాత్రమే ప్రామాణికంగా తీసుకుంటారు. పథకంకోసం దరఖాస్తు చేసుకునేందుకు కొత్త పట్టాదారులకు ప్రాధాన్యం ఉంటుంది. రైతు బీమాపోర్టల్‌లో అర్హులైన రైతులను గుర్తించే ప్రక్రియను

మిగతా 8లో

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో రసాభాస

- జగిత్యాల ఎమ్మెల్యే ఎదుట మాజీ మంత్రి జీవన్‌రెడ్డి వర్గీయుల నిరసన
- డూప్లికేట్ కాంగ్రెస్ అంటూ నినాదాలు



నిరసన వ్యక్తం చేస్తున్న జీవన్‌రెడ్డి వర్గీయులు

సారంగాపూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల కేంద్రంలో మంగళవారం కల్యాణలక్ష్మి చెక్కులు, రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో రసాభాస జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను ఉద్దేశించి మాజీ మంత్రి జీవన్‌రెడ్డి వర్గీయులు డూప్లికేట్ కాంగ్రెస్ అంటూ నినాదాలు చేశారు. రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ తనఅనుచరులతో కలిసి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తుండగా మాజీ మంత్రి జీవన్‌రెడ్డి వర్గీయులు కాంగ్రెస్ కండువాలతో హాజరయ్యారు. అయితే వేదికమీదకు జీవన్‌రెడ్డి వర్గీయులను ఆహ్వానించక పోవడంపట్ల వారు నిరసన వ్యక్తం చేస్తూ మేమే ఒరిజినల్ కాంగ్రెస్ నాయకులం.. మీరేమో డూప్లికేట్ కాంగ్రెస్ నాయకులు అంటూ నినాదాలు చేశారు. మీరు ఒరిజినల్ కాంగ్రెస్ నాయకులైతే పార్టీ కండువాలు వేసుకోవాలని జీవన్‌రెడ్డి వర్గీయులు రైతువేదిక మెట్లపై కూర్చొని కాంగ్రెస్ జిందాబాద్ అంటూ కొంతసేపు నినాదాలు చేశారు. పోలీసులు మాజీ మంత్రిజీవన్‌రెడ్డి వర్గీయులకు నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించి వేశారు.

యూరియా పంపిణీ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలి

● కలెక్టర్ సత్యప్రసాద్

కథలాపూర్, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): యూరియా పంపిణీకి సంబంధించిన రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. మండలంలోని భూషణరావుపేట, సిరికొండ సింగిల్ విండో కార్యాలయాల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి రైతు పేరు, ఎకరాలు, ఆధార్ కార్డు, విస్తీర్ణం వారికి ఇచ్చిన ఎరువుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సీఈవోలకు సూచించారు. ఎకరానికి ఒకబస్తా చొప్పున రైతులకు ఎరువులు అందించేలా చూడాలన్నారు. అనంతరం భూషణరావుపేట ఉన్నత పాఠశాలను పరిశీలించి మధ్యాహ్నభోజన అమలు తీరును ప్రధానోపాధ్యాయుడు రాజయ్యను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన విద్య, మౌలికవసతులను కల్పించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని అన్నారు. ఫేషియల్ రిజగ్నేషన్ సిస్టంను అమలు చేస్తున్న తీరును పరిశీలించారు.



సిరికొండలో ప్యాక్స్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

తరగతిగదిలో ఉపాధ్యాయుడు బోధిస్తున్న తీరును పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్లు పరిశీలించి నిర్మాణాలు వేగవంతంగా జరిగేలా చూడాలని అన్నారు. నిర్దేశించిన గడువులోపు నిబంధనలకు అనుగుణంగా నాణ్యమైన పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి గఫూర్‌కు సూచించారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణం విషయంలో ఏమైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయా అని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్‌డీఓ జివాకర్‌రెడ్డి, తహసీల్దార్ వినోద్, ఎంపీడీఓ శంకర్‌నాయక్, ఏఓ యోగిత, సీఈఓలు రాంప్రసాద్, అరుణ్, ఆర్‌ఐ నగేశ్ ఉన్నారు.

సహకార సంఘం తనిఖీ

మేడిపల్లి, ఆగస్టు 8 : మేడిపల్లి మండల కేంద్రంలోని సహకారసంఘాన్ని కలెక్టర్ సత్యప్ర సాద్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ బోర్డు, యూరియా విక్రయాల రిజిష్టర్‌లను పరిశీలించారు. రైతు పంట విస్తీర్ణం ఆధారంగా యూరియా ఇవ్వాలని సూచించారు.

ఎరువుల విక్రయాలకు సంబంధించిన వివరాలు తప్పనిసరి నమోదు చేయాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్ మేడిపల్లి 2ఆగ్రోస్ రైతుసేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునిందర్, ఏవో షాహిద్ అలీ, సీఈవో బొం దయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు

జగిత్యాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఆయా జిల్లాల కలెక్టర్లతో సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్, అదనపు కలెక్టర్ బీఎస్ లతతో పాటు పలు ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు హాజరయ్యారు. అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి పలు సూచనలు అందించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణారావు, డీజీపీ జితేందర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు

● ఎస్పీ అశోక్ కుమార్



సీజ్ చేసిన గంజాయిని పరిశీలిస్తున్న డ్రగ్ డిస్పోజల్ కమిటీ

జగిత్యాల క్రైం, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాలు రవాణా చేసినా, అమ్మినా, సేవించినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అశోక్‌కుమార్ హెచ్చరించారు. జిల్లా డ్రగ్‌డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో ఇన్సినిరేషన్ ప్రక్రియ ద్వారా వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన 36 కేసు ల్లో నిందితుల నుంచి రూ.9 లక్షల విలువగల 35.96కిలోల గంజాయిని ఎన్‌డీపీఎస్ చట్ట ప్రకారం దహనం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ కొందరు అక్రమార్జనే ధ్యేయంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రలోభాలకు గురిచేస్తూ మత్తులోకి దించుతున్నారన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు రఘు చందర్, రాములు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సీఐలు కరుణాకర్, రవి, ఆర్‌ఐ కిరణ్ కుమార్ ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత

జగిత్యాల క్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ పోయినా, చోరీకి గురైనా సీఐఈఆర్ అప్లికేషన్ ద్వారా తిరిగి పొందే అవకాశం ఉందని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జిల్లా పరిధిలో పోగొట్టుకున్న, చోరీకి గురైన రూ.27 లక్షల విలువగల 144మొబైల్ ఫోన్లను మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాల యంలో బాధితులకు ఎస్పీ అందజేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సీఐఈఆర్ వెబ్‌సైట్‌లో వినియోగదారులు తమ సెల్ ఫోన్ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. పోయిన సెల్ ఫోన్ల రికవరి కోసం ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఒక ఆర్ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టు బుల్లతో ప్రత్యేక టీం ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1,268 ఫోన్లను రికవరి చేసి బాధితులకు అందించడం జరిగిందన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన సీఐఈఆర్ అప్లికేషన్ ఆవశ్యకతను తెలుపుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సెకండ్ హ్యాండ్ ఫోన్లు కొనే ముందు పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు. ఎవరికైనా సెల్ ఫోన్ దొరికితే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అందజేయాలని కోరారు. ఈ సందర్భంగా సాంకేతికతను ఉపయోగించి మొబైల్ ఫోన్లను రికవరి చేయడంలో ప్రతిభ కనబరిచిన ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ రఫీక్ ఖాన్, హెడ్ కానిస్టేబుల్ మహమూద్, కానిస్టేబుల్ అజర్‌లను ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం బాధితులు తమ ఫోన్ పోయినపుడు అవలంబించాల్సిన విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ శాఖ అధికారులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణంలో నిబంధనలు పాటించాలి

రాయికల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు ఇంటిని నిర్మించుకోవాలని రాయికల్ మున్సిపల్ మేనేజర్ వెంకట్ అన్నారు. రాయికల్ పట్టణంలోని 1వ వార్డులో నిరుపేద కుటుంబానికి చెందిన భారతం దేవమ్మ ఇందిరమ్మ ఇంటికి మంగళవారం భూమిపూజచేసి, ఆన్‌లైన్ చేశారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ ఏఈ తిరుమల, మున్సిపల్ సిబ్బంది రజాక్, గంగారెడ్డి, శేఖర్, నరేష్, వార్డు కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ షాకీర్, బొద్దుల శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కృత్యాధార బోధన చేయాలి

మల్లాపూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు కృత్యాధార బోధన చేయాలని మల్లాపూర్ మండల విద్యాధికారి దామోదర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మండలస్థాయి మేళాలో 28మంది ఉపాధ్యాయులు 35బోధనోపకార కృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు భాస్కర్, పీఆర్పీలు మహేశ్, దేవరెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

అర్హులైన మహిళలను స్వశక్తి సంఘాల్లో చేర్చాలి

● జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రఘువరన్



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ రఘువరన్

జగిత్యాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన మహిళలను స్వశక్తిసంఘాల్లో చేర్చాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రఘువరన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో మహిళాశక్తి సంస్థ అర్హులైన వృద్ధులు, మహిళలు, దివ్యాంగ మహిళలతో సంఘాలు, కిశోరబాలికల సంఘాలను ఏర్పాటు చేయడం తదితర అంశాలపై సెర్ప్ ఏపీఎం, సీసీలు, మండల సమాఖ్యలతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీల్లో అందుబాటులో ఉన్న ఓటరులిస్టు, చేయూతలిస్టు, దివ్యాంగుల పింఛన్ లిస్టు ప్రకారం స్వశక్తిసంఘాల్లో ఉన్న వారిని గుర్తించాలన్నారు. ఇంకా సంఘాలలో లేని వారి వివరాలు సేకరించి సెర్ప్ నిర్దేశించిన నాలుగురకాల సంఘాలను కొత్తగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈనెల 15వతేదీ నుంచి 30వతేదీ లోపు సంఘాలు ఏర్పాటు చేసి బ్యాంకుల్లో ఖాతాలు తెరవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రవికుమార్, జిల్లా సంక్షేమ అధికారి నరేశ్, సెర్ప్ ఏపీడీ సునీత, జిల్లా ఐబీ డీపీఎం విజయభారతి, మార్కెటింగ్ డీపీఎం రమేశ్, ఫైనాన్స్ డీపీఎం నారాయణ, పింఛన్ డీపీఎం, నాగేశ్వర్ రావు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సరోజన, కార్యదర్శి ఆమని, కోశాధికారి హరిత పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, ERRA NARESH, S/o. MOHAN, R/o. 3-76/A, Neelojipally, Kodurupaka, Boinpally, Rajanna sircilla, have changed my name as YERRA NARESH KUMAR, S/o. MOHAN

AJK-238083

CHANGE OF NAME

★ I, NAMPELLI CHAITANYA S/O. NAMPELLI NARSIMHA CHARY, H.NO: 10-1-264E/1, BHAGYA NAGAR, KARIMNAGAR (T.G), HAVE CHANGED MY NAME AS NAMPALLY CHAITANYA S/O. NAMPALLY NARSIMHA CHARY (AS PER AADHAR)

AJK-238520

పేరు మార్పు

★ నేను ఏలిగేటి లింగుబాయి భర్త: ఏలిగేటి నారాయణ, ఇ.నెం. 6-12/3, కోమటీకొండాపూర్ గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం, జగిత్యాల జిల్లా. నా పేరును అన్ని అవసరాల కొరకు ఆల్లేటి లింగవ్వగా మార్చుకున్నాను.

AJK-17132

CHANGE OF NAME

★ I, "CEERLA KRISHNA" S/O. Late. CHEERLA NARAYANA(Old Name), R/O. H.NO: 3-71/23, RANGAPET, SARANGAPUR, JAGITYAL. I HAVE CHANGED SURNAME AS "CHEERLA KRISHNA " S/O. Late. CHEERLA NARAYANA(New Name).

AJK-17132

CHANGE OF NAME

★ I, "CEERLA RADHA" W/O. Late. CHEERLA NARAYANA(Old Name), R/O. H.NO: 3-71/23, RANGAPET, SARANGAPUR, JAGITYAL. I HAVE CHANGED SURNAME AS "CHEERLA RADHA " W/O. Late CHEERLA NARAYANA(New Name).

AJK-17132

3+2 స్కీం కలదు

VEHICLE FOR SALE

» TS-13-UB-4567 MARUTI DZIRE VXI Model - 2022 వాహనము 16-8-25న ఉదయం 10-30 ని.లకు అమ్మబడును. వివరములకు అరుణా ఫైనాన్స్ లిమిటెడ్ ✆ 88863 34747, 99499 82916

AJB-587

కావలెను

★ వనిత మైత్రి పబ్లిక్ వెల్ఫేర్ సొసైటీ (VMPWS) CBO-TI KNRలో ప్రాజెక్ట్ మేనేజర్ (1) కావలెను. అర్హత: MSW/M.A Sociology చివరి తేది:17-08-2025 (HIV Field) లో అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత mail id: vanithamythri@gmail.com, Cell: 80087 38007, 95502 57516

AJK-238628

SERVICE

★ కపిల్‌లో బ్రోకెన్ చిట్స్ కలవు స్పాటల్ పేమెంట్ ఆసక్తి గల వరు సంప్రదించండి. నోట్ : Shurities పెట్టించబడును. సెల్ : 8096520976

AJW-6642

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి ప్రకటనలకై సంప్ర: 99854 11174

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్ : 9703618691, 99854 10640

జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్ : 99854 11262

వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063



మద్యం మత్తులో వాహనాలు నడిపిన వారికి జరిమానా

ఇల్లంతకుంట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడిపిన 21 మందికి సిరిసిల్ల సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ జరిమానా విధించినట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తులను మంగళవారం కోర్టు కానిస్టేబుల్స్ జీవన్, తిరుపతి కోర్టులో ప్రవేశపెట్టగా సిరిసిల్ల సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ జరిమానా విధించినట్లు తెలిపారు.

భార్య, అత్త వేధింపులు.. యువకుడి ఆత్మహత్య

శంకరపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబాలాపూర్ గ్రామంలో అత్త, భార్య సూటిపోటీ మాటలతో వేధించడంతో తట్టుకోలేక ఓ యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంబాలాపూర్ గ్రామానికి చెందిన గుడిసె మహేందర్ (24) హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామానికి చెందిన ప్రవళికను రెండేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఈ నెల 1న పాప జన్మించింది. వివాహం జరిగినప్పటి నుంచి వీరి మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. భార్య ప్రవళిక, అత్త ఎల్లమ్మ మహేందర్‌ను ఇష్టానుసారంగా దూషించడంతో మనస్తాపానికి గురై ఈ నెల 4న గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు 108 వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడు మహేందర్ తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి

జమ్మికుంట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని నాయిని చెరువులో ప్రమాదవశాత్తు పడి మహమ్మద్ జబ్బర్ (64) అనే మతిస్థిమితం లేని వృద్ధుడు మృత్యువాత పడ్డాడు. ఈ నెల 12న ఇంటి నుంచి ఉదయం బయటకు వెళ్లిన జబ్బర్ ఎంతకూ తిరిగి రాలేదు. కుటుంబసభ్యు లు బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఆరా తీసిన ఫలితం లేకుండా పోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

చోరీకి యత్నం

రాయికల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణానికి చెందిన పిప్పరి పురుషోత్తం ఇంట్లో సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి యత్నించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పురుషోత్తం వారం రోజుల క్రితం హైదరాబాద్‌లో ఉంటున్న తన కొడుకు ఇంటికి వెళ్లాడు. కాగా ఇది గమనించిన దుండగులు సోమవారం రాత్రి ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి యత్నించారు. మంగళవారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు, పురుషోత్తంకు సమాచారం అందించారు. పోలీసులు, పురుషోత్తం కుటుంబసభ్యులు ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లో విలువైన వస్తువులు ఏమీ పోలేవని గుర్తించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


హన్మాజీపేట గ్రామంలోని గుట్ట

గుట్ట కోసం ఏకమయ్యారు..

- పర్యావరణ పరిరక్షణకు హన్మాజీపేట గ్రామస్థుల ప్రయత్నం
- మొరం టెండర్ రద్దు చేయాలని ఆందోళన

జగిత్యాలరూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం హన్మాజీపేట గ్రామంలోని గుట్టను కాపాడడం కోసం ఊరంతా ఏకమయ్యారు. హన్మాజీపేట గ్రామంలోని సర్వేనంబర్ 596లో గల గుట్ట మొరం తరలించేందుకు ప్రభుత్వం టెండర్ పిలిచినట్లు గ్రామస్థులకు తెలిసింది. గుట్ట నుంచి మొరం తరలించడం ద్వారా పర్యావరణం దెబ్బతిని గ్రామం ఎడారిగా మారే ప్రమాదం ఉందని హన్మాజీపేట వాసులు ఆందోళన చెందుతున్నారు. గుట్టను కనుమరుగు చేసేవిధంగా జారీ అయిన టెండర్లను రద్దు చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్‌ను, మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని, పంచాయతీ కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేశారు. గుట్ట మొరం తరలింపుతో జరిగే నష్టాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి గ్రామస్థులు తీసుకెళ్లారు.

గుట్టపై పురాతన ఆలయాలు

ప్రకృతి రమణీయతకు నెలువైన గుట్టపై తాము దైవంగా భావించే అతి ప్రాచీన రామాలయం, అంజనేయస్వామి, పెద్దమ్మతల్లి వంటి ఆలయాలు ఉన్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. గుట్ట మట్టిని తరలిస్తే కోల్పోతామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురాతనమైన హన్మాజీపేట గుట్ట పశువులకు, జంతువులకు, ఇతర జీవరాశులకు జీవానాధారంగా ఉందన్నారు.

దీంతో గుట్ట నుంచి మొరం తరలించే టెండర్ ప్రక్రియను ఆపాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. టెండర్ ప్రక్రియను రద్దు చేయకపోతే తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హన్మాజీపేట గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.

టెండర్ రద్దు చేయాలి
గొడుగు సురేష్, హన్మాజీపేట



పురాతనమైన గుట్ట పశువులకు, జంతువులకు, ఇతరజీవరాశులకు జీవనాధారంగా ఉంది. గుట్టపైన తాము ఆరాధ్యదైవంగా భావించే పురాతనమైన పెద్దమ్మతల్లి, రామాలయం, అంజనేయ ఆలయాలు ఉన్నాయి. గుట్టనుండి మొరం తరలిస్తే పర్యావరణం దెబ్బతిని హన్మాజీపేట, కండ్లపల్లి, పొరండ్ల, బాలపల్లి గ్రామాలు కాలుష్యం అవుతాయి. గుట్ట మొరం తరలించే టెండర్‌ను రద్దు చేయాలి.

గుట్టను కాపాడాలి
గాలిపెల్లి శ్రీధర్, హన్మాజీపేట



హన్మాజీపేటలోని గుట్టనుండి మొరం తరలించేందుకు టెండర్ పిలుస్తున్నట్లు మాదృష్టికి వచ్చింది. మూడు గ్రామాలకు నెలువైన గుట్ట నుంచి మొరం తరలిస్తే చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు చాలా నష్టపోతారు. వెంటనే మొరం తరలించే టెండర్‌ను రద్దు చేసి గుట్టను కాపాడాలి. టెండర్ రద్దు చేయకపోతే అందోళనలను మరింత ఉధృతం చేస్తాం.


మాజీ మంత్రి జీవన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న హన్మాజీపేట గ్రామస్థులు(ఫైల్)

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఏసీపీ వెంకటస్వామి

మానకొండూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ ఏసీపీ వెంకటస్వామి సూచించారు. మానకొండూర్‌లో మంగళవారం కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం తూర్పు దర్వాజ బస్టాండ్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. యువత వ్యసనాలకు అలవాటుపడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. యువత కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి కుటుంబానికి, గ్రామానికి, మంచిపేరు తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామాల్లో దొంగతనాల నివారణకు రాత్రివేళల్లో యువత గస్తీలుగా తిరగాలన్నారు. అనంతరం సైబర్ నేరాల పోస్టర్‌ను గ్రామస్థుల సమక్షంలో ఆవిష్కరించారు. అంతకు ముందు గ్రామంలోని వీధుల గుండా పోలీసులు తిరిగి కాగితాలు, నంబర్ ప్లేట్ లేని 69 వాహనాలను గుర్తించి పోలీసుస్టేషన్‌కు తరలించారు. స్థానిక సీఐ సంజీవ్, తిమ్మాపూర్, కొత్తపల్లి, సీఐలు సదన్‌కుమార్, కోటేశ్వర్, పుల్లయ్య, ఎస్‌ఐ స్వాతి, పోలీసులు ఉన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏసీపీ వెంకటస్వామి

కాల్వలో పడి ద్విచక్రవాహనదారుడికి తీవ్రగాయాలు

మానకొండూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాకతీయ ఉపకాల్వలో పడి ద్విచక్రవాహనదారుడికి తీవ్రగాయాలయ్యాయి. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లికి చెందిన ఎ సంపత్ అనే వ్యక్తి మండలంలోని అన్నారం గ్రామంలో బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై మంగళవారం రాత్రి వెళ్తున్నాడు.

కాగా పోచంపల్లి గ్రామ శివారుకు రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి కాకతీయ ఉపకాల్వలో పడ్డాడు. సదరు వ్యక్తి అరుపులు విన్న బాటసారులు గమనించి స్థానికుల సహాయంతో బయటికి తీశారు. తీవ్రగాయాలైన సంపత్‌ను 108 వాహనంపై కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వీసా కోసం డబ్బులు వెచ్చించి మోసపోయిన యువతి

- మనస్తాపంతో ఆత్మహత్య

జగిత్యాలరూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విదేశాలు వెళ్లడానికి వీసాల కోసం ఖర్చులుపెట్టి ఆర్థికంగా నష్టపోయిన జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన నల్లమోతు హర్షిత (25) అనే యువతి పురుగుల మందుతాగి మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. జగిత్యాల పట్టణ సీఐ కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం అంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నల్లమోతు హర్షిత కుటుంబసభ్యులు 25 ఏళ్ల క్రితం జగిత్యాల మండలం హస్నాబాద్‌కు వలస వచ్చి నివాసం ఉంటున్నారు. ఇటీవలే డిగ్రీ పూర్తిచేసి ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాలని ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికా యూనివర్సిటీల కోసం తెలిసిన వ్యక్తుల ద్వారా ప్రయత్నించింది. అమెరికాలోని తప్పుడు యూనివర్సిటీని ఎంచుకొని మోసపోయింది. తద్వారా వీసాల కోసం సుమారు 10 లక్షల రూపాయల వరకు డబ్బులను వెచ్చించి ఆర్థికంగా నష్టపోయింది. చివరి ప్రయత్నంలో భాగంగా జర్మనీ దేశానికి వెళ్తానని ఇంట్లో తండ్రికి చెప్పడంతో తండ్రి శ్రీనివాస్ ఇప్పటికే చాలా డబ్బులు ఖర్చుచేశావని వద్దని వారించారు. దీంతో మనస్తాపం చెందిన యువతి తాను విదేశాలకు వెళ్లి చదువుకోవాలనే కల నేరవేరదని భావించిన హర్షిత ఈనెల 6 వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా బంధువులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతున్న క్రమంలో పరిస్థితి విషమించి మంగళవారం హర్షిత మృతి చెందింది. మృతురాలు హర్షిత తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు.


హర్షిత (ఫైల్)

మోర్ సూపర్‌మార్కెట్‌లో.. ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కమాన్ ప్రాంతంలోని మోర్ సూపర్‌మార్కెట్‌లో మంగళవారం ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గడువు ముగిసిన పదార్థాలను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. గడువు ముగిసిన ఫేడ్ ఐటమ్స్‌ను విక్రయిస్తున్నారనే సమాచారంతో మోర్ సూపర్‌మార్కెట్‌లో తనిఖీలు నిర్వహించామని కరీంనగర్ ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ అంకిత్‌రెడ్డి తెలిపారు. నూడుల్స్, చిక్కి ప్యాకెట్లు, ధనియాల ప్యాకెట్లు గడువు ముగిసినప్పటికీ విక్రయిస్తున్నట్లు గుర్తించి డస్ట్‌బిన్‌లో పారేశామని తెలిపారు. చాలారకాల ఫైడ్ ఐటమ్స్ రెండు నుంచి ఏడు రోజుల వ్యవధిలో గడువు ముగుస్తున్నట్లు గుర్తించామని, వీటన్నిటినీ తొలగించాలని ఆదేశించామని అన్నారు. మోర్ సూపర్ మార్కెట్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేసినట్లు, తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

గంజాయి కేసులో ఇద్దరికి 20 ఏళ్ల జైలు

ఖమ్మంలీగల్ ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గంజాయిని తరలిస్తూ పట్టుబడిన ఇద్దరికి 20ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు న్యాయాధికారి కె ఉమాదేవి మంగళవారం తీర్పు చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా గద్వాలకు చెందిన మహేష్ అలియాస్ నాయక్ మల్లేష్, జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన గడ్డం బువన్‌కు శిక్ష విధించారు. జల్సాలకు అలవాటుపడి వీరిద్దరూ అక్రమార్జన కోసం 2021 ఏప్రిల్ 28న మోతుగూడెం నుంచి కారులో 30లక్షల రూపాయల విలువచేసే 200 కేజీల గంజాయి కొనుగోలు చేసి తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో ఖమ్మం సమీపంలోని వి వెంకటాయపాలెం వద్ద పోలీస్ చెక్‌పోస్టు ఉండటంతో కారును వేగంగా నడుపుకుంటూ ప్రయాణికులతో కూడిన ఆటోను బలంగా ఢీకొట్టారు. ఆటో, కారు బోల్తాపడ్డాయి. ఆటోలోని ప్రయాణికుడు మృతి చెందాడు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. అనంతరం కారును పరిశీలించగా 200 కేజీల 100 గంజాయి ప్యాకెట్లు లభించాయి. ఇద్దరు నిందితులను అదుపులో తీసుకోగా, మరో నిందితుడు ఇషాక్ పరారీలో ఉన్నాడు. పోలీసులు దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణ జరిపిన న్యాయాధికారి కె ఉమాదేవి శిక్ష ఖరారు చేస్తూ తీర్పు చెప్పారు.

రోడ్డు మరమ్మతు చేయాలని నిరసన


యువకుడితో మాట్లాడుతున్న పోలీసులు

గన్నేరువరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తన ఇంటి ఎదుట వరద నీరు ఆగి బురదమయం అవుతోందని, రోడ్డు మరమ్మతు చేసే వరకు ఎవరినీ వెళ్లనీయనని రోడ్డుకు అడ్డంగా చెట్ల మొద్దులను పెట్టి నిరసన తెలిపాడు వెదిర శ్రీకాంత్ అనే యువకుడు. మండల కేంద్రం నుంచి పారువెళ్లకు వెళ్లే దారిలో ఎస్సీ కాలనీలో చిన్నపాటి వర్షానికే తన ఇంటి ఎదుట వరదనీరు చేరి కుంటను తలపించే విధంగా ఉంటుందన్నారు. దీంతో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ వెదిర శ్రీకాంత్ అనే యువకుడు రోడ్డుకు అడ్డంగా మొద్దులను పెట్టి నిరసన తెలిపాడు. రోడ్డుపై వాహనాలు ఆగిపోవడంతో విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి వెంకటరెడ్డి యువకుడికి నచ్చచెప్పే ప్రయత్నం చేయగా వాగ్వాదానికి దిగాడు. దీంతో కార్యదర్శి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు అక్కడకు చేరుకొని యువకుడిని సముదాయించి రోడ్డుపైన పెట్టిన మొద్దులను తొలగించారు.

గొల్లపల్లిలో చోరీ.. బంగారం, నగదు అపహరణ

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరుగగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్థులు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బండి సమ్మయ్య నెల రోజుల నుంచి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇటీవల కుటుంబ సభ్యులు పని నిమిత్తం ఇంటికి వచ్చి తిరిగి ఆసుపత్రికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని భావించిన నిందితులు ఇంట్లోకి చొరబడి 18 తులాల వెండితో పాటు మూడు తులాల బంగారం, ఎనిమిది వేల నగదును అపహరించినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంటికి తాళాలు సైతం పగలగొట్టి ఎత్తుకొని వెళ్లారని, పక్కింటి వారు సమాచారం ఇస్తే ఇంటికి వచ్చి చూశామని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. సంఘటన స్థలానికి బ్లూ కోల్ట్స్ పోలీసులు చేరుకొని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయంలో దొంగతనం

మానకొండూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి ప్రక్కన ఉన్న గ్రామపంచాయతీ కార్యాలయ గేటును లేపి లోనికి ప్రవేశించారు. కార్యాలయ తలుపుల తాళాలను పగులకొట్టి అందులోని విద్యుత్ మోటార్లు, బోరులకు సంబంధించిన పరికరాలు, ఇనుప సామాను ఎత్తుకెళ్లారు. మంగళవారం గ్రామపంచాయతి సిబ్బంది కార్యాలయానికి వెళ్లగా తాళాలు పగులకొట్టి ఉండడాన్ని గమనించి అధికారులకు సమాచారం అందించారు. గ్రామ కార్యదర్శి పోలీసులకు పిర్యాదు చేయగా స్థానిక సీఐ సంజీవ్ సంఘటనా స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరు, సీసీ పుటేజిని పరిశీలించారు.

ఏసీబీకి చిక్కిన సర్వేయర్

- సర్వే రిపోర్టు కోసం ఫోన్ పే ద్వారా లంచం

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) ఫోన్ పే అవినీతి చేపను ఏసీబీ అధికారులకు పట్టించింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఓ రైతు ఎనిమిది నెలల క్రితం తన భూమి సర్వే చేయాలని మండల సర్వేయర్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. సర్వే చేసి రిపోర్టు ఇవ్వడంలో సర్వేయర్ పెండ్యాల సునీల్ డబ్బులు డిమాండ్ చేశాడు. తన ప్రైవేట్ సర్వేయర్ కె రాజేందర్‌రెడ్డి ద్వారా మంతనాలు జరిపారు. 20 వేల రూపాయల డిమాండ్ చేయగా పదివేల రూపాయలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో రైతు జూలై 2న ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు చెప్పిన ప్రకారం నగదు ఇచ్చేందుకు చేసే ప్రయత్నం విఫలం కావడంతో ఫోన్‌పే ద్వారా రాజేందర్‌రెడ్డికి డబ్బులు పంపించమని సర్వేయర్ సునీల్ చెప్పాడు. దీంతో రాజేందర్‌రెడ్డికి జూలై 9న రైతు 10 వేలు ఫోన్ పే చేసిన వెంటనే రాజేందర్‌రెడ్డి సునీల్‌కు ఫోన్‌పే చేశాడు. ఏసీబీ అధికారులు శాంతినగర్‌లో భూమి సర్వే చేస్తుండగా సునీల్‌ను అదుపులోకి తీసుకున్నారు. రిజిస్టర్ కేస్ ఆఫ్ అదర్(ఆర్‌సీవో) కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చనున్నట్లు డీఎస్పీ తెలిపారు.


ఏసీబీకి చిక్కిన సునీల్, రాజేందర్‌రెడ్డి

హిమ్మత్‌నగర్, కొండపాక గ్రామస్థులతో ఏసీపీ సమావేశం

వీణవంక, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హిమ్మత్‌నగర్, కొండపాక గ్రామస్థులతో హుజూరాబాద్ ఏసీపీ మాధవి మంగళవారం సమావేశం నిర్వహించారు. హిమ్మత్‌నగర్ గ్రామస్థులు 34 రోజులుగా కొండపాక గ్రామంలోని మానేరు వాగులోని ఇసుక క్వారీలో లారీలపై పరదలు కట్టుట కోసం రిలే నిరహర దీక్షలు చేస్తున్నారు. ఏసీపీ మాధవి రెండు గ్రామాల నాయకలను పెద్దలతో చర్చించి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. కొండపాక గ్రామస్థులు పరదలు కట్టుట నిలిపివేయాలని కోరారు. స్థానిక ఎన్నికల అనంతరం సమస్యకు పరిష్కారం చూపెడుతామని ఇరుగ్రామాల ప్రజలు తొందరపడద్దన్నారు. హిమ్మత్‌నగర్ గ్రామస్థులు ధర్నాలు, దీక్షలు, రాస్తారోకో చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ, ఎస్‌ఐ ఆవుల తిరుపతి తదితరులు ఉన్నారు.

రేపు ఎక్సైజ్ స్టేషన్‌లో వాహనాల వేలం

సుల్తానాబాద్, ఆగస్టు 12: (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌లో ఈ నెల 14న వాహనాల వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ఒక ప్రకటనలో తెలిపారు. సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలో వివిధ సందర్భాల్లో పట్టుకున్న ద్విచక్ర వాహనాలను, ఆటోలను 14న గురువారం ఉదయం 10 గంటలకు జిల్లా మద్యనిషేధ, ఎక్సైజ్ అధికారి సమక్షంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ గురునాథ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సకాలంలో వేలం పాటలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఒకరికి మించి మరొకరు..

- ప్రమాదకరంగా డ్రైవింగ్ చేసిన ఆర్టీసీ డ్రైవర్లు
- సోషల్ మీడియాలో వీడియో వైరల్

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం అంటూ అధికారులు ఊదరకొడుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితిని గమనిస్తే అందుకు విరుద్ధంగా ఉంటోంది. తాజాగా హుజూరాబాద్ డిపోనకు చెందిన ముగ్గురు ఆర్టీసీ డ్రైవర్లు చేసిన ప్రమాదకర డ్రైవింగ్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడం కలకలం రేపుతోంది. జమ్మికుంట బస్‌స్టేషన్ నుంచి హుజూరాబాద్ ఆర్టీసీ డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సులు హుజూరాబాద్ వైపునకు ఒకే సమయంలో బయల్దేరాయి. ఆర్టీసీ డ్రైవర్లు ఒకరిని మించి మరొకరు ప్రమాదకరంగా ఇతర వాహనాలు వెళ్లకుండా ఓవర్ టేక్ చేస్తూ బస్సులను నడిపారు. దీంతో ప్రయాణికులు భయందోళనకు గురయ్యారు. వేరే వాహనాలు వెళ్లకుండా ప్రమాదకరంగా ఆర్టీసీ బస్సులను నడుపుతుండగా వెనుకవస్తున్న వాహనదారులు వీడియో తీసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడంతో వైరల్‌గా మారింది.


పక్కపక్కనే ప్రమాదకరంగా వెళ్తున్న ఆర్టీసీ బస్సులు

కుక్కల దాడిలో.. మనుబోతుకు గాయాలు

కొడిమ్యాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపేట అటవీ ప్రాంతంలో మంగళవారం ఉదయం రేసు కుక్కల దాడిలో మనుబోతుకు గాయాలయ్యాయి. మనుబోతు కోనాపూర్ గ్రామంలోకి రాగా గ్రామస్థులు రక్షించి అటవీ సిబ్బందికి సమాచారం అందించారు. అటవీశాఖ కొడిమ్యాల రేంజర్ గులాం మొయినుద్దీన్ ఆధ్వర్యంలో బీట్ అధికారి ప్రవీణ్, బేస్ క్యాంప్ సభ్యుడు మహేందర్ మనుబోతును మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో వైద్యాధికారి రాకేష్‌తో చికిత్స చేయించారు. అనంతరం మండలంలోని సూరంపేట అటవీ ప్రాంతంలో వదిలి పెట్టారు.


గాయపడి గ్రామంలోకి వచ్చిన మనుబోతు

మూడు రోజులైనా అదుపులోకి రాని మంటలు

- రూ.1.67కోట్ల విలువైన ఆస్తి నష్టం

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలోని గోదాంలో ఆదివారం అగ్నిప్రమాదం జరగ్గా మంగళవారం కూడా మంటలు అదుపులోకి రాలేదు. అగ్ని ప్రమాదంలో రూ.1.67కోట్ల నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. మూడు రోజుల నుంచి రాత్రింబవళ్లు పోలీస్, అగ్నిమాపక శాఖ, రెవెన్యూ, సివిల్‌సప్లయిస్ అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మెట్‌పల్లి, జగిత్యాల అగ్నిమాపక కేంద్రాల నుంచి వాహనాలను రప్పించారు. దట్టమైన పొగతో మంటలు ఎగిసిపడడంతో ఎక్స్‌కవేటర్లతో గోదాం చుట్టూ గోడలను బద్దలుకొట్టి అందులోంచి కాలుతున్న గోనె సంచులను బయటకు తీసుకొచ్చి ఆర్పివేస్తున్నారు. గోదాంలో గోనె సంచుల కింద కట్టెలు వేసి ఉండడంతో మంటలు అదుపులోకి రావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. ప్రమాదంలో మార్కెట్ గోదాం పూర్తిగా దెబ్బతిన్నదని అధికారులు పేర్కొన్నారు. అగ్నిప్రమాదంపై సివిల్ సప్లయిస్, మార్కెట్ కమిటీ శాఖ అధికారులు పోలీసులకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు.

గోదాంలో సివిల్ సప్లయిస్ శాఖకు చెందిన వాడిన సంచులు 2018 సంవత్సరం నుంచి నిల్వ చేస్తున్నారు. గోదాం కిరాయి ప్రతి నెల మార్కెట్ కమిటీకి 38వేల రూపాయలు చెల్లిస్తున్నారు. గోదాంలో నిల్వచేసిన సంచులకు ప్రతి సంవత్సరం టెండర్ వేయాల్సి ఉంది. కానీ అధికారుల నిర్లక్ష్యంతో ఏడు సంవత్సరాల నుంచి గోనె సంచులను గోదాంలో నిల్వ చేస్తున్నారు. దీంతో అగ్నిప్రమాదంలో గోదాంలో ఉన్న గోనె సంచులన్నీ కాలిపోగా వాటికి ఇన్సూరెన్స్ ఉందని అధికారులు తెలిపారు. డీఎస్పీ రాములు, సీఐ అనిల్‌కుమార్, ఎస్సైలు కిరణ్‌కుమార్, తహసీల్దార్ నీత, ఆర్‌ఐలు కాంతయ్య, ఉమేష్, గోదాం ఇన్‌చార్జి సురేష్‌లు అక్కడే ఉండి ఫైర్ సిబ్బందికి సూచనలు సలహాలు ఇస్తున్నారు.


మెట్‌పల్లి ఏఎంసీలోని గోదాంను పరిశీలిస్తున్న ఎస్సై కిరణ్‌కుమార్

మంటలు త్వరగా ఆర్పేలా చర్యలు

- ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మార్కెట్ యార్డులోని గోదాంలో మంటలు త్వరగా ఆర్పేలా చర్యలు తీసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఫైర్ సిబ్బందికి సూచించారు. ప్రమాదం జరిగిన గోదాంను ఏఎంసీ ఛైర్మన్ కూన గోవర్ధన్, ఆర్డీవో శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ప్రమాదాన్ని నివారణకు చేపట్టిన చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాలిపోయిన సంచులను వెంటనే ఇతర ప్రదేశానికి తరలించాలని, మంటలు ఇతర గోదాంలతో పాటు చుట్టున్న ఇళ్లకు వ్యాపించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ మోహన్, తహసీల్దార్ నీత, అధికారులు, సిబ్బంది ఉన్నారు.


ప్రమాద కారణాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

రాష్ట్రపతిని కలిసిన అంతర్గాం కస్తూర్బా విద్యార్థులు




అంతర్గాం కస్తూర్బా విద్యార్థులను అభినందిస్తున్న రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, షార్ట్‌ఫిల్మ్ చిత్రీకరించిన విద్యార్థి సహస్ర

అంతర్గాం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): యూట్యూబ్ షార్ట్ ఫిల్మ్‌లో రెండోస్థానం పొందిన అంతర్గాం కస్తూర్బా విద్యార్థులు ఈ నెల 9న ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్మును కలిశారు. కస్తూర్బా 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు దీక్ష షార్ట్‌ఫిల్మ్‌ను చిత్రీకరించి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. షార్ట్‌ఫిల్మ్‌ను చూసిన రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము విద్యార్థులను తన కార్యాలయానికి పిలిపించుకుని అభినందించారు. ఉపాధ్యాయురాలు లత, స్కూల్ కెప్టెన్ ఎలిగేటి సహస్ర ఆధ్వర్యంలో రాష్ట్రపతిని కలిశారు. తెలంగాణ నుంచి తమకు అవకాశం వచ్చిందని వారు పేర్కొన్నారు.

ఉద్యోగ నైపుణ్యాల పెంపునకు 'ఉన్నతి'



మాట్లాడుతున్న ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ

గణేశ్‌నగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించడానికి మంగళవారం ఉన్నతి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకునే విద్యార్థులకు ఇది ఒక గొప్ప అవకాశమని, సద్వినియోగం చేసుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. అనంతరం కరీంనగర్ జోన్ బాధ్యులు ప్రవీణ్ కుమార్, సామ్యూల్ మాట్లాడుతూ నెల రోజులు కొనసాగే ఉన్నతి తరగతులను సద్వినియోగం చేసుకొని డిగ్రీ కాగానే ఉద్యోగం సంపాదించుకోవాలన్నారు. టీఎస్‌కేఈసీ కోఆర్డినేటర్ రాజేష్, డాక్టర్ బుర్ల నరేష్ పాల్గొన్నారు.

హుజూరాబాద్ ఆసుపత్రిని సందర్శించిన ప్రపంచ బ్యాంకు బృందం



హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో ఫైర్ సేఫ్టీపై సిబ్బందికి వివరిస్తున్న బృందం

హుజూరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని ప్రపంచ బ్యాంకు బృందం సభ్యులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రోగులకు అందుతున్న సేవలపై ఆస్పత్రి సిబ్బందితో చర్చించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా క్వాలిటీ మేనేజర్ సాగర్ ఆధ్వర్యంలో ఫైర్ సేఫ్టీ మాక్ డ్రిల్ నిర్వహించి, విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి, రోగులకు వివరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నారాయణరెడ్డి, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్..



నేడు ఎడమచేతి వాటం దినోత్సవం

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : 'కుడి ఎడమైతే పొరపాటులేదోయ్' అని అన్నాడు ఓ సినీ కవి. నిత్య జీవితంలో పనులకు అందరూ కుడి చేతిని వినియోగిస్తే కొందరు ఎడమచేతితో అవలీలగా చేస్తూ ఆకర్షిస్తారు. కుడి చేతి వారితో సమానంగా చేయగలుగుతారు. ఎడమచేతితో పనులు చేయడం అలవాటో, పొరపాటో తెలియదు గానీ ఓ విలక్షణత మాత్రం వారిలో కనిపిస్తుంది. ఈ అలవాటుకు ఓ ప్రత్యేక రోజు ఉంది. ఆగస్టు 13న అంతర్జాతీయ ఎడమచేతివాటం దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. తొలిసారి 1976 ఆగస్టు 13న నిర్వహించారు. ఎడమచేతివాటం వారు ఎదుర్కొంటున్న అసౌకర్యాలపైనా, ఇతర సమస్యలపైనా అవగాహన కల్పించడం, వాటిని అధిగమించడానికి ఎడమచేతివాటం వారిని ప్రోత్సహించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం. పోలియో, ప్రమాదాల బారిన పడిన వారు, ఎడమచేతివాటం ఉన్నవారు అన్నిరంగాల్లో రాణిస్తారని, మరికొందరు కాస్త మందకొడిగా ఉంటారని చెబుతున్నారు. ఎడమచేతివాటం ఉన్నవారు ఎక్కువ శాతం క్రీడలు, కళారంగాల్లో రాణిస్తారు. పాఠశాలలు, కళాశాలలతోపాటు కార్యాలయాల్లో చాలామంది ఎడమచేతితో పనులు చేయడం, రాయడం చూస్తుంటాం. ఎడమచేతివాటంతో వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుంది.

చిన్నప్పటి నుంచి అలవాటు : జి.ఉజ్వల, హిందీ ఉపాధ్యాయిని, సిద్ధార్థ స్కూల్



నాకు చిన్నప్పటి నుంచి ఎడమచేతితో రాయడం అలవాటు. ఇబ్బంది లేకుండా రాస్తాను. మా బాబు రచిత్ (4వ), పాప రక్షిక (యూకెజి) కూడా ఎడమ చేతితోనే రాస్తారు.

ఎడమ చేతివాటంతో ప్రత్యేక గుర్తింపు పి.అభినందన్, 9వ, బ్లూబెల్స్ స్కూల్



ఎడమచేతితో రాయడంతో నాకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎడమచేతితో గుండ్రంగా, అందంగా రాయగలను. చిన్నప్పటి అలవాటు స్థిరమైపోయింది. ఎడమచేతితో రాస్తేనే రాసినట్లుగా అనిపిస్తుంది.

చల్లంగా చూడు పోచమ్మ తల్లీ..



బద్దిపోచమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ



బద్దిపోచమ్మ దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, ఆంధ్రజ్యోతి (ఆగస్టు 12) : పిల్లాపాపలను, పాడి పంటలను చల్లగా చూడు బద్ది పోచమ్మ తల్లీ.. అంటూ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న భక్తులు మంగళవారం ఉదయం మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని శివసత్తుల ఊరేగింపుతో ఆలయానికి చేరుకున్నారు. నెత్తిన బోనాలు, సంకన పిల్లలతో గంటల తరబడి ఆలయంలోకి చేరుకున్న భక్తులు పట్నాలు వేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు చర్యలు చేపట్టారు.

రాజన్న నిత్యాన్నదాన ట్రస్టుకు రూ. 5 లక్షల విరాళం

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.5 లక్షల 116 విరాళంగా అందజేసినట్లు ఆలయ ఈవో రాధాబాయి ఒక ప్రకటనలో తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన ముస్కు కార్తీక్ రెడ్డి- సుష్మ దంపతులు, వారి పిల్లలు ఆరుష్, కియాన్‌లు రాజరాజేశ్వర స్వామి పేరుతో విరాళం అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఆలయ ఈవో రాధాబాయికి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో అశోక్‌కుమార్, ఉద్యోగులు శ్రీనివాస్ శర్మ, బొడుసు మహేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం...

వేములవాడ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన భీమేశ్వరస్వామి ఆలయంలో శత వారం సందర్భంగా 108సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. నిర్వాహకులు మోటూరు మధుసూదన్ ఆధ్వర్యంలో భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. హిందు ఉత్సవ కమిటీ సభ్యులు మోటూరి మధు, గడప కిషోర్ పాల్గొన్నారు.

కిక్కిరిసిన అంజన్న క్షేత్రం

మల్యాల: కొండగట్టు ఆంజనేయ స్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. శ్రావణమాసంకు తోడు మంగళవారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొవడానికి బారులు తీరారు. అనంతరం అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. బేతాళుడు, రాముల వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగింది. అంజన్న దర్శనంకు కొండగట్టుకు వచ్చిన తాటిపల్లికి చెందిన రోషిని భక్తురాలు సెల్‌ఫోన్ పోగొట్టుకోగా అది స్వీపర్ లక్ష్మికి దొరకడంతో అవుట్ పోస్టు పోలీసులకు అప్పగించింది. దీంతో విచారణ జరిపి ఏఎస్సై చిలుక శ్రీనివాస్ భక్తురాలికి సెల్‌ఫోన్ అప్పగించారు.




బోనాలతో మహిళలు, కొండగట్టు అంజన్న ఆలయ ఆవరణలో భక్తులు

ధర్మపురిలో సంకష్టహర చతుర్థి పూజలు

ధర్మపురి: సంకష్టహర చతుర్థి సందర్భంగా ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ గణ పతి ఆలయంలో మంగళవారం ఘనంగా అభిషేకం నిర్వహించారు. ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. అనేక మంది భక్తులు ప్రత్యేక పూజలు చేసి స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథం, సాయికుమార్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంపత్‌కుమార్, రాజగోపాల్ పాల్గొన్నారు.



ధర్మపురిలో విశేషాలంకరణలో గణపతి స్వామివారు

ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య వేడుకలకు ఆహ్వానం



రేషవేణి మహేష్

ధర్మారం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే 78వ స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనాలని ధర్మారం మండల యువకుడికి ఆహ్వానం అందింది. మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన రేషవేణి మహేష్ యువశక్తి యూత్ స్థాపించి కొంత కాలంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడు. సామాజిక సేవా రంగంలో చేస్తున్న కృషికి కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా శాఖ, నెహ్రూ యువ కేంద్రాలు దేశంలోని వంద మందిని భారత్ వలంటీర్లుగా ఎంపిక చేసింది. ఎంపికైన వంద మందిలో ధర్మారం మండలానికి చెందిన మహేష్ ఉన్నారు. గతంలోనూ ఢిల్లీలో నిర్వహించిన మేరీ మాటి, మేరీ దేశ్ కార్యక్రమాలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి మహేష్ ప్రాతినిధ్యం వహించారు. ఈ అవకాశం కల్పించినందుకు అధికారులకు మహేష్ కృతజ్ఞతలు తెలిపారు. పలువురు రేషవేని మహేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు తగ్గిన ఇన్‌ఫ్లో

ప్రాజెక్టులోకి 5,658 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం ఇన్‌ఫ్లో తగ్గింది. ఎస్సారెస్పీలోకి 5,658 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి గాను ప్రస్తుతం 44.937 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 5,658 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 3,500 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150 క్యూసెక్కులు, అల్లీసాగర్ ఎత్తిపోతల పథ కానికి 360 క్యూసెక్కుఉల, గుత్పా ఎత్తిపోతల పథకానికి 135 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 482 క్యూసెక్కుల నీరు ఆవిరిఅవుతోంది. ఇదిలా ఉండగా జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 39.254 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 7.104 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

వారంలోగా దళితుల.. భూసమస్యను పరిష్కరించాలి

- మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- గోపాల్‌పూర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే, కలెక్టర్



రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి, కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్

గన్నేరువరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వారంలోగా దళితుల భూ సమస్యను పరిష్కరించాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. గన్నేరువరం మండలంలోని గోపాల్‌పూర్, తిమ్మాపూర్ మండలంలోని జూగుండ్ల గ్రామాల సరిహద్దులో ఒక రైతుకు, దళితులకు మధ్య నెలకొన్న భూవివాదాన్ని పరిష్కరించేందుకు కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్, ఏడీ ప్రభాకర్‌తో కలిసి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం గోపాల్‌పూర్, జూగుండ్లలో పర్యటించి వివాదంలో ఉన్న భూమిని పరిశీలించారు. గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన దళితులు కొంపెల్లి మల్లయ్య, వీరయ్య, నర్సయ్య, ఎల్లయ్యతో పాటు జూగుండ్ల గ్రామానికి చెందిన శ్రీగిరి కనుకయ్యకు చెందిన సర్వేనంబర్ 178లో సుమారు ఎనిమిదేకరాల వ్యవసాయ భూమిపై ఏళ్ల తరబడి వివాదం నెలకొంది. ఈభూమి రికార్డుల్లో దళితుల పేరున ఉన్నప్పటికీ మోఖాపై లేదని, తమ భూమి ఆక్రమణకు గురైందని దళితులు ప్రజావాణిలో కలెక్టర్‌కు, ఆర్డీవోకు దరఖాస్తు చేసుకున్నారు. సమస్యను పరిశీలించేందుకు జిల్లా యంత్రాంగం గ్రామాలకు కదిలివచ్చారు. అధికారుల ముందు భూమి మాదంటే మాదని బాధితులు తమ గోడును వెళ్లబోసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఇరు గ్రామాల్లో భూసమస్యను పరిష్కరించాలనే ఉద్దేశంతోనే జిల్లా అధికార యంత్రాంగాన్ని తీసుక వచ్చినట్లు వివరించారు. ఇరు గ్రామాల భూమి రికార్డు మ్యాపులను అధికారులు పరిశీలించారన్నారు. భూమి కొలతలు, హద్దులు తేల్చాలని వారం లోగా భూసర్వేను చేపట్టి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఇరువర్గాలు ఆందోళన చెందవద్దని సూచించారు. కార్యక్రమంలో గన్నేరువరం, తిమ్మాపూర్ మండలాల తహసీల్దార్లు జక్కని నరేందర్, శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ఆధార్‌లో మార్పులు

- కేరాఫ్ వివరాలు తొలగింపు
- తండ్రి, భర్త పేర్లు ఇకపై ఉండవు



ఐదేళ్లు దాటిన చిన్నారులకు అప్‌డేట్ తప్పనిసరి

చొప్పదండి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆధార్ కార్డు లేకుంటే ప్రస్తుతం ఏ పని జరగడం లేదు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధార్‌కార్డు వివరాల్లో సైతం ఎప్పటికప్పుడు మార్పులు చేస్తున్నారు. తాజాగా భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ఆధార్‌కార్డులో కొన్ని మార్పులు చేసింది. ఇక నుంచి ఆధార్ కార్డులపై కేరాఫ్ స్థానా న్ని తొలగించింది.

తండ్రి, భర్త పేర్లు లేకుండానే వ్యక్తి పేరు, చిరునామాతో నూతన విధానం అమల్లోకి తెచ్చింది. గతంలో తండ్రి, భర్త పేర్లతో కొన్ని సాంకేతిక సమస్యలు వస్తున్నాయని, వాటి స్థానంలో కేరాఫ్ ఏర్పాటు చేసింది. ఈ విధానంలోనూ ఇబ్బందులు తప్పడం లేదని సంస్థ గుర్తించింది. ఈ విధానాన్ని పూర్తిగా తొలగించినట్లు యూ ఐడీఏఐ ప్రకటించింది. ఇక నుంచి ఆధార్ అప్‌డేట్ చేసుకున్న వ్యక్తులకు, వివాహం జరిగిన మహిళలకు భర్త పేరు లేకుం డానే చిరునామా మార్పులు ఉంటాయని స్పష్టం చేసింది. ఇంటర్నెట్‌లో చిరునామా మార్చుకునే విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది.

ఐదేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు సమయంలో బయో మెట్రిక్ విధానం ఉండదని, ఐదేళ్ల దాటితే వారికి తప్పనిసరిగా బయెమెట్రిక్ నమోదు చేయించాలని యూఐడీఏఐ సూచించింది. ఏడేళ్ల దాటినా బయోమెట్రిక్ ఇవ్వకపోతే ఆధార్ కార్డులు డియాక్టివేట్ అవుతాయని యూఐడీ ఏఐ తెలి పింది. ఏడేళ్లలోపు అప్‌డేట్ చేసుకున్న వారు పది హేనేళ్లకు మరోసారి అప్‌డేట్ చేసు కోవాల్సి ఉంటుంది. ప్రతి ఒక్కరు తమ ఆధార్ కార్డును ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

గంగాధరలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ



ఇల్లంతకుంట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని గంగాధర ఆలయంలో అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేశారు. శ్రావణమాస మంగళవారాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, సామూహిక కుంకుమపూజల అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు మూగు నాగ రాజుశర్మతో పాటు మహిళలు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొయ్యడ సృజన్ కుమార్



ఏఐఎస్ఎఫ్ జెండా ఎగురవేస్తున్న సృజన్‌కుమార్

గణేశ్‌నగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారమే ఏఐఎస్ఎఫ్ లక్ష్యమని, దేశవ్యాప్తంగా విద్యార్థులకు అండగా నిలిచిన ఏకైక విద్యార్థి సంఘమని మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొయ్యడ సృజన్ కుమార్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకల సందర్భంగా మంగళవారం గీతభవన్ చౌరస్తాలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం దేశంలోనే మొట్టమొదటగా ఏర్పడిన ఏకైక విద్యార్థి సంఘమన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో అనేక మంది బలిదానాలు చేసిన గొప్ప చరిత్ర ఉందని, తెలంగాణ రాష్ట్ర సాధనలో క్రియాశీలక పాత్ర పోషించిందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని మండి పడ్డారు. బడ్జెట్ కేటాయంపు ల్లో విద్యా రంగానికి సరిపడా నిధులు కేటాయించడం లేదన్నారు. ప్రభుత్వ విద్యపై నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు విడుదల చేయాలని, ఫీజు నియంత్రణ చట్ట అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, మచ్చ రమేష్, హేమంత్ మాజీ నాయకులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, పైడిపెల్లి రాజు, బోనగిరి మహేందర్, తాళ్లపల్లి లక్ష్మణ్, యువజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగంధర్, నగర నాయకులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మంగళగౌరి వ్రతాలు

కోరుట్ల, ఆగస్టు 12 : శ్రావణ మంగళవారం పురస్కరించుకొని పట్టణంలోని కోటి నవదుర్గ దేవలయంలో సామూహిక మంగళగౌరి వ్రతాలు సాగాయి. పద్మశాలికులోన్నతి సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో మార్కండేయ మందిరం, కోటి నవదుర్గ దేవలయంలో మంగళగౌరి వత్రాలు వేద పండితులు ప్రదీప్ శర్మ, శ్రీధర్ శర్మ, సంతోష్ శర్మ, షాకేత్‌శర్మల మంత్రోచ్చరణ మధ్య సాగింది. మహిళలు విష్ణుశాస్త్ర నామపారాయణం జరిపారు.



సీపీఎస్ రద్దు మహాధర్నాను విజయవంతం చేయాలి

జగిత్యాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దును డిమాండ్ చేస్తూ వచ్చే నెల 1వ తేదీన నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు బోయినిపల్లి ఆనందరావు, ప్రధాన కార్యదర్శి యాల్ల అమర్‌నాథ్ రెడ్డి కోరారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో మహా ధర్నా పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంట్రీ బ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబర్ ఒకటవ తేదీన పీఆర్టీయూ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించతలపెట్టిన మహాధర్నాకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో టీజేఏసీ జిల్లా చైర్మన్ నాగేందర్‌రెడ్డి, నాయకులు రవి బాబు, రాఘవ, సుగుణాకర్, పీఆర్టీయూ నాయకులు ఏవీఎస్ రాజు, వేణు గోపాల్ రావు, భూపాల్ రావు, చంద్రశేఖర్, రాజేందర్, రత్నాకర్, జమున, చందన, పద్మ, అనుజ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

రాయికల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యను అందించినప్పుడే సత్ఫలితాలు సాధించవచ్చని మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు అన్నారు. మండలంలోని సింగర్రావుపేట బీసీ గురుకుల పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెట్టి పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో స్వప్నకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

బీర్‌పూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ గ్రామానికి చెందిన కట్టెకోల పార్వతి(గంగవ్వ) కుమారుడు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. కుమారుడు మృతి చెందిన నాటి నుంచి గంగవ్వ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతుందని తెలుసుకున్న యువ చైతన్య యూత్ సభ్యులు స్పందించి మంగళవారం గంగవ్వ కుటుంబానికి ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణపై ర్యాలీ

కథలాపూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : నులిపురుగుల నివారణపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకుగాను మండల కేంద్రంలో మాస్ట్రో పాఠశాల విద్యార్థులు, యాజమాన్యం మంగళవారం ర్యాలీ నిర్వహించారు. రక్తహీనత, పోషకాహార లోపాలకు నులిపురుగులు కారణమవుతాయని మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని పేర్కొన్నారు. 1 నుంచి 19 సంవత్సరాల వయసున్న వారు మాత్రలు వేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఆకుల రాజేశ్, ప్రిన్సిపాల్ ఆకుల రంజిత్, డైరెక్టర్ ఆకుల రాజేందర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా తిరంగా ర్యాలీ





మల్యాలలో జాతీయ జెండాతో ర్యాలీ, చౌలమద్దిలో తిరంగాయాత్ర నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి మండలం చౌలమద్ది గ్రామంలో బీజేపీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజుపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహించారు. గ్రామంలో జాతీయ జెండాలను చేతపట్టుకుని చేస్తూ నినాదాలు చేసుకుంటా బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో తిరంగా యాత్ర జిల్లా కన్వీనర్ రుద్ర శ్రీనివాస్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఏలేటి నరేందర్‌రెడ్డి, ఇల్లెందుల శ్రీనివాస్, చిలువేరి మల్లేష్‌యాదవ్, ప్రతాప్, సంజీవ్, సుభాష్, శేఖర్, రవీందర్, చిన్నమల్లయ్య, రాజు, రమేష్, చిరంజీవి, రవి, శ్రీనివాస్, ప్రశాంత్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

●**ధర్మపురి:** మండలంలోని పెద్దనక్కలపేట గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో హర్ గర్ తిరంగా బైక్ ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ధర్మపురి మండల అధ్యక్షులు కుమ్మరి తిరుపతి, హర్ గర్ తిరంగా ప్రోగ్రాం మండల ఇంఛార్జ్ గుంటుక సదాశివ్, మండల ఉపాధ్యక్షులు ఒగేటి అంజయ్య, స్వర్గం వీరేశం, పోతరాజుల తిరుపతి, ప్రధాన కార్యదర్శులు కామెర ప్రభాకర్, జెల్ల వినోద్, కార్యదర్శి రంగు శ్రీధర్, సీనియర్ నాయకులు గడ్డం శంకర్, కోడిగంటి కిరణ్, బూత్ అధ్యక్షులు గడ్డం వినోద్, అనుపురం పెద్దన్న, బరిగెల మహేష్, సింగం శంకర్, బర్కం గణేష్, పోచమల్లు, సాయిని సతీష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

●**మల్యాల:** మల్యాల మండల కేంద్రంలో మంగళవారం త్రివర్ణయాత్ర నిర్వహించారు. త్రివర్ణ పతాక వైభవాన్ని చాటడం కోసం చేపట్టిన హర్‌ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా తిరంగా యాత్ర చేపట్టగా గ్రామస్తులు, నాయకులు, వాగ్దేవి విద్యాసంస్థలు, సాయిశ్రీనివాస విద్యాలయ విద్యార్థులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

●**భీమారం:** మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రజల్లో జాతీయ భావం పెంపొందించే విధంగా స్వాతంత్ర్యం కోసం మహనీయులు చేసిన పోరాటాలను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరిలో దేశం పట్ల, జాతీయ జెండా పట్ల పౌరుల్లో జాతీయ భావం పెంచే కార్యక్రమమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగం శివ కుమార్, సీనియర్ నాయకులు గంగారెడ్డి, బద్దం జలపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి వడ్లకొండ రాము, సూర రాజశేఖర్, అడువాల గంగారాం, పల్లి భీమయ్య, లింగారెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

●**కథలాపూర్:** కథలాపూర్‌లో బీజేపీ నాయకులు ర్యాలీ నిర్వహిం చారు. బీజేపీ కార్యాలయం నుంచి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం దాకా నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. జాతీయ సమైక్య స్ఫూర్తిని చాటేందుకు ప్రతీ ఇంటిపై మూడు రంగుల జెండాలను ఎగరవేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్యాల మారుతి, మండల ఇన్‌చార్జ్ గోపాడి నంద్యారపు వెంకటేశ్, మండల కన్వీనర్ కథలాపూర్ మహేశ్, ప్రధాన కార్యదర్శి గడ్డం జీవన్‌రెడ్డి, పిడుగు ఆనందరెడ్డి, గాంధారి శ్రీనివాస్, కాశోజీ ప్రతాప్, జలంధర్, అశోక్ తదితరులు ఉన్నారు.

'రైతు బీమా'కు నేడే ఆఖరు

(5వ పేజీ తరువాయి)

వ్యవసాయాధికారులు ఇప్పటికే ప్రారంభించారు. రైతు వేదికలో వ్యవసాయాధికారులను సంప్రదించి కొత్త రైతులు వివరాలు నమోదు చేసుకోవచ్చు. అధికారులు కూడా క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ఆన్‌లైన్ చేస్తున్నారు. దరఖాస్తు ఫారానికి పట్టాదారు పాస్ బుక్ లేదా తహసీల్దార్‌తో డిజిటల్ సంతకం కలిగిన డీఎస్ పేపర్, ఆధార్ కార్డు, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులు జతపరచాల్సి ఉంటుంది.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

-భాస్కర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



రైతు బీమా పథకాన్ని అర్హులైన ప్రతీ రైతు సద్వినియోగం చేసుకోవాలి. కొత్తగా పట్టా పాస్ పుస్తకాలు వచ్చిన వారు దరఖాస్తు చేసుకోవాలి. ప్రతీ రైతు నేరుగా ఏఈవోలను సంప్రదించి ఈ అవకాశాన్ని వినియో గించుకోవాలి. కొత్త నమోదు గడువు బుధవారంతో ముగుస్తుంది. రైతులు గమనించి గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి.

యువత ఆధ్యాత్మికత వైపు అడుగులు వేయాలి

జగిత్యాల క్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : యువత చదువుతో పాటు ఆధ్యాత్మికత వైపు అడుగులు వేయాలని జగిత్యాల ఆర్డీవో పులి మధు సూదన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పురాణీపేటలో ప్రసిద్ధిగాంచిన లోకమాత పోచమ్మ తల్లి ఆలయ 63వ వార్షికోత్సవ వాల్ పోస్టర్లను శుక్రవారం ఆర్డీవో ఆవిష్కరించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. ఈనెల 20 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఆలయ వార్షికోత్సవ వేడుకలను సమస్త భక్తులు విజయవంతం చేసి అమ్మవారి కృపకు పాత్రులు కావాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు గాజుల రాజేందర్, నాగమల్ల గంగాధర్, రెపల్లె హరికృష్ణ, రాజగోపాల చారి, జనగామ గంగాధర్, రాఘవ చారి ఉన్నారు.

శాఖాపూర్-కొండాపూర్ రోడ్డుకు మోక్షం

వెల్గటూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): శాఖాపూర్ నుంచి కొండాపూర్ వరకు బీటీ రోడ్డుకు మోక్షం కలిగింది. గత కొన్ని సంవత్సరాలుగా ఇబ్బంది పడుతున్న రెండు గ్రామాల ప్రజలు, రైతులు బీటీ రోడ్డు నిర్మించడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత తొమ్మిది సంవత్సరాలుగా రోడ్డు లేక రెండు గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందిని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దృష్టికి తేగా స్పందించిన మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి బీటీ రోడ్డు వేసేలా చర్యలు చేపట్టారు. కాగా మంగళవారం బీటీ రోడ్డు నిర్మాణం ప్రారంభం కావడంతో శాఖాపూర్, కొండాపూర్ గ్రామాల ప్రజలు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

భూ రికార్డుల పరిశీలన

బీర్‌పూర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలం పైలట్ ప్రాజెక్ట్ గ్రామం కోమన్‌పెల్లిలో భూ రికార్డుల రీసర్వే పూర్తి కావడంతో మంగళవారం అదనపు కలెక్టర్ బీఎస్ లత రికార్డులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ ముఖీ మాట్లాడి భూ సంబంధిత వివరాలను రైతులకు వివరించారు. సర్వేలో రైతులకు సంబంధించిన భూ వివరాల్లో ఏమైన తేడాలు ఉంటే వారికి నోటీసులు అందించి వాటిని సరిచేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మధుసుధన్, ఏడి వెంకట్ రెడ్డి, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో భీమేష్, ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని మెట్‌పల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బార్ ప్రెసిడెంట్ కంతి మోహన్ రెడ్డి టీం 15 ఓవర్లలో 129 పరుగులు చేసింది. అనంతరం ఫీల్డ్‌లోకి దిగిన మెజిస్ట్రేట్ టీం 2 ఓవర్లు మిగిలి ఉండగానే లక్ష్యం పూర్తి చేసి విజయం సాధించారు. ఆగస్టు 15వ రోజున బహుమతి ప్రదానం ఉంటుందని బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్,క్రీడ కార్యదర్శి బిగుల్లా శంకర్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ పడిగేలా శ్రీనివాస్, జాయింట్ కార్యదర్శి గజేల్లి రామ్ దాస్, ఈసి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు

జగిత్యాలలో వర్షం

జగిత్యాల అర్బన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. భారీ వర్షంతో రోడ్లన్ని వర్షం నీటితో నిండిపోయాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. నాలాలన్ని పొంగిప్రవహించాయి. దీంతో జనాలకు రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ధర్మపురి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కోర్టులో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా విధులు నిర్వహిస్తున్న నరహరిపై జరిగిన దాడిని నిరసిస్తూ ధర్మపురి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మంగళవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా ధర్మపురి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు అలుక వినోద్ కుమార్ మాట్లాడుతూ అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను వెంటనే అమలు చేయాలని అన్నారు. అడ్వకేట్ నరహరిపై దాడి చేసిన వ్యక్తులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి నిందితులను శిక్షించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు అలుక వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి మామిడాల శ్రీకాంత్‌కుమార్, రౌతు రాజేష్, అప్పాల నిరంజన్, ఏజీపీ ఇమ్మడి శ్రీనివాస్, బందెల రమేష్, రామడుగు రాజేష్, కస్తూరి శరత్, సుంకె రాజు, కలమడుగు కీర్తి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం



పల్లె దవాఖానా ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్

సారంగాపూర్, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోనే జగిత్యాల నియోజక వర్గానికి అత్యధికంగా 14 పల్లె దవాఖానాలు మంజూరు రావడం జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమంలో బాగంగా మండలంలోని నాగునూర్ గ్రామంలో రూ. 20 లక్షలతో నిర్మించిన పల్లె దవాఖానను ప్రారంబించారు. అనంతరంగా రూ. 17.60లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. అనంతరం మండల కేంద్రంలో గల రైతు వేదికలో ఏర్పాటు చేసిన నూతన రేషన్ కార్డులు, కల్యాణ లక్ష్మీ, సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి పనిచేస్తానని విమర్శలకు అభివృద్ధితోనే సమాదానం చెప్తానన్నారు. అర్హులైన పేద ప్రజలకు సంక్షేమ ఫలాలు అందేల కృషి చేస్తానని అన్నారు. అనంతరం బాలికల కస్తూరిబా పాఠశాలను సందర్శిం చారు. ఈ సందర్భంగా వంట గదులను, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం బట్టపెల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ కోల రాఘవులు అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబ సబ్యులను పరామర్శించి ప్రగాడ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం పలు కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వహీద్దీన్, ఎంపీడీవో గంగాదర్, వైద్యురాలు రాధ, నాయకులు రాజేందర్‌రెడ్డి, కోల శ్రీనివాస్, మనోహర్‌రెడ్డి, రామరావు, సుధాకర్‌రావు, సురేందర్, మల్లారెడ్డి, నర్సింహరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

కోరుట్ల రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూర్ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఇంటర్ విద్యార్థులకు ఇంగ్లీష్ బోధించేందుకు తాత్కలిక ప్రతిపాదికన మహిళ అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేక అధికారి ఎం రజిత ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకోనే అభ్యర్థులు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి పీజీ, బీఈడీ, టెట్ ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఆగస్టు 16 తేది సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

మల్యాల, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రానున్న మూడు రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనే వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నరేశ్‌కుమార్ ఒక ప్రకటలో సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ శాఖ 100ను సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి అనుమతి మంజూరు

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మూడో సబ్‌స్టేషన్ నిర్మాణానికి 1.30 కోట్ల రూపాయల నిధులతో సాంకేతిక అనుమతులు మంజూరు అయ్యాయని ఎస్ఈ సుదర్శనం తెలిపారు. పట్టణంలోని రేగుంట గ్రామ శివారులో నిర్మించబోయే మూడో కొత్త 33-11 కేవి సబ్ స్టేషన్ కోసం సేకరించిన స్థలాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ మధుసూదన్, ఏడీఈలు మనోహర్, రాజబ్రహ్మాచారి, ఏఈ రవి పాల్గొన్నారు.

'దివ్యాంగులంటే చిన్నచూపా?'



కలెక్టర్ కార్యాలయ పాలనాధికారికి వినతిపత్రం అందిస్తున్న దివ్యాంగులు

జగిత్యాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులంటే ఎందుకంత చిన్నచూపు అంటూ దివ్యాంగులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం జగిత్యాల జిల్లా వికాలంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో వికలాంగులు కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయ ఏఓ హకీమ్‌కు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం దివ్యాంగులు మాట్లాడుతూ ప్రజావాణిలో వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన మర్రిపెల్లి రాజా గంగారాం పట్ల అమానుషంగా ప్రవర్తించడం సరి కాదన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వికలాంగుల హక్కుల పోరాట కమిటీ అధ్యక్షులు లంక దాసరి శ్రీనివాస్, ఎం రాజు, భూమయ్య పాల్గొన్నారు.

గ్రంథాలయ దినోత్సవం

జగిత్యాల అర్బన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని జిల్లా గ్రంధాలయంలో జాతీయ గ్రందాలయ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రంధాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని పురస్కరించుకుని జిల్లా లైబ్రేరియన్ శకుంతల నివాళులు అర్పించారు.

నేడు మంత్రి అడ్లూరి పర్యటన

గొల్లపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలంలో ఎస్సీఎస్టీ, మైనారిటి, వికలాంగుల సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బుధవారం పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి మంగళవారం తెలిపారు. గొల్లపల్లి మండలం శ్రీరాముల పల్లె గ్రామంలో నిరుద్యోగ యువతులకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం అనంతరం మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

కొడిమ్యాల, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని జిల్లా టాస్క్ మేనేజర్ గంగాప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ విద్యార్థులకు టాస్క్ (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్)పై అవగాహన, ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. విశ్వనాథరాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

గొల్లపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి తహసీల్దార్‌గా నియమితులైన మహ్మద్ అబ్దుల్ మజీద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బుగ్గారం తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న మజీద్‌ను కలెక్టర్ సత్య ప్రసాద్ గొల్లపల్లి మండలానికి బదిలీ చేశారు. ఇంతకాలం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న కట్కం వరందన్‌ను కలెక్టరేట్‌కు బదిలీ చేశారు.

స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి



పరేడ్ మైదానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ

జగిత్యాల క్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య వేడుకలకు అన్ని ఏర్పాటు పూర్తి చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. 15 ఆగస్టు స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించే పోలీస్ పరేడ్ మైదానాన్ని ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. వేడుకలకు రానున్న ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పనులు తక్షణమే పూర్తి చేయాలన్నారు. ఆర్డీవో మధు సూదన్, డీఎస్పీ రఘు చందర్, డీఆర్‌డీఏ పీడీ రఘు వరన్, కమీషనర్ స్పందన తదితరులు ఉన్నారు. స్వాతంత్ర వేడుకల సందర్భంగా ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు బందోబస్తు చర్యల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంతో పాటు కోరుట్ల, మెట్‌పెల్లి, ధర్మపురి ప్రాంతాల్లోని ముఖ్య కూడళ్లతో పాటు బస్టాండ్, టవర్, జనం ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో బీడీ టీం సభ్యులు విస్తృత తనిఖీలు చేపట్టారు. అనుమానస్పద వస్తువులు గమనిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా స్వాతంత్ర్య వేడుకలకు అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ అశోక్ కుమార్ వివరించారు.

భూ ఆక్రమణను అడ్డుకున్న అధికారులు

కొడిమ్యాల, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపూర్ గ్రామ శివారులోని 192, 348 సర్వే నంబర్లలోని రెవెన్యూ భూమిని మంగళవారం కొందరు ఆక్రమించే యత్నం చేయగా రెవెన్యూ, అటవీ అధికారులు అడ్డుకున్నారు. ప్రభుత్వ భూమిని మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు చెట్లను తొలగించి చదును చేస్తున్నారన్న సమాచారంతో రెవెన్యూ పరిశీలకుడు కరుణాకర్, కొడిమ్యాల డీఎఫ్ఆర్‌వో ముషీర్ అహ్మద్, బీట్ ఆఫీసర్ అశ్విని, సర్వేయర్ తిరుపతి, పంచాయతీ కార్యదర్శి మహేష్ మోఖాపైకి వెళ్లి ఆక్రమణ యత్నాన్ని అడ్డుకున్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అటవీ, రెవెన్యూ అధికారులు ఆక్రమణకు వచ్చిన వ్యక్తులకు నచ్చచెప్పారు. గతంలో అసైన్‌మెంట్ పొందిన వారిని గుర్తిస్తామన్నారు. ప్రభుత్వ భూమికి హద్దులు నిర్ణయించి కంచె వేస్తామని తెలిపారు.

తిరంగాయాత్రను విజయవంతం చేయాలి

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): హర్ ఘర్ తిరంగా యాత్రను విజయవంతం చేయాలని జిల్లా కన్వీనర్ రుద్ర శ్రీనివాస్ కోరారు. మంగళవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పట్టణ శాఖ సమావేశం నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు బోడ్ల రమేష్ ఆధ్వర్యంలో ఆగస్టు 15వ తేదీ వరకు ప్రతీ బూత్‌లో తిరంగా యాత్ర నిర్వహించాలన్నారు. జిల్లా కన్వీనర్ రుద్ర శ్రీనివాస్ మాట్లాడుతూ తిరంగా జెండాను ప్రతి ఇంటికి పంపిణీ చేసి ప్రతి ఇంటిపై జెండా ఎగురవేయాలని కోరారు. హర్ ఘర్ తిరంగా యాత్ర బైక్ ర్యాలీ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డొనికెల నవీన్, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి సుంకెట విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

జగిత్యాల అగ్రికల్చర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గంజాయికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు ఇరుగురాల భూమేశ్వర్ అన్నారు. ఏఐఎస్ ఎఫ్ 90వ ఆవిర్భావ వేడుకలు జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక ఎస్‌కేఎన్ఆర్ జూనియర్ కళాశాల ఎదుట సంఘ జెండాను ఆవిష్కరించి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భూమేశ్వర్ మాట్లాడుతూ 1936లో ఉత్తరప్రదేశ్‌లోని లక్నో బెనారస్‌లో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించి, 90ఏళ్లు పూర్తిచేసుకుందన్నారు. చదువుతూ పోరాడూ- చదువుకై పోరాడు అనే నినాదంతో ముందు కు వెళ్లి స్వాతంత్ర్య, తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో పోరాటం చేసిన చరిత్ర కలిగిన ఏకైక సంఘంగా ఏఐఎస్ఎఫ్ 90వవసంతంలోకి అడుగుపెట్టడం సంతోషకరంగా ఉందన్నారు. ఓవైపు ప్రభుత్వం విద్య పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తుంటే మరోవైపు గంజాయి నియంత్రణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గంజాయి వైఫల్యంపై వ్యతిరేకంగా పోరాడాలని, భవిష్యత్తు సమరశీల పోరాటాలకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీ యూసీ నాయకులు వెన్న మహేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అక్రమాలిక్, ఉపాధ్యక్షులు మందరాకేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్య భరత్ రాథోడ్, వేణు, సంజ య్, రేవంత్, సాయిహర్ష, నిఖిల్, మణిదీప్ ఉన్నారు.

ఎరువుల విక్రయాల్లో నిబంధనలు పాటించాలి

● **జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్**



రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఎరువుల విక్రయాలలో నిబంధనలు పాటించాలని జిల్లా వ్యవ సాయఅధికారి భాస్కర్ పేర్కొన్నారు. మండలంలోని పలు ప్రాథమికవ్యవసాయ సహకార సంఘాల్లో, అగ్రోస్ రైతుసేవ కేంద్రాలలో మంగళవారం ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్, ఈపాస్‌లో ఎరువుల అమ్మకాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎరువుల విక్రయాలలో నిబంధనలు తప్పకుండా పాటించాలని, ఎరువుల అమ్మకాలు తప్పనిసరిగా ఈ పాస్ ద్వారా చేపట్టాలని, అమ్మకాలుకి సంబందించిన రిజిస్టర్ మెయింటెయిన్ చేయాలని లేనిచో ఫర్టిలేజర్ లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. రైతులకి అవసరం మేరకే యూరియా విక్రయించాలని అధిక మొత్తంలో కొందరికే ఇవ్వరాదన్నారు. అలాగే రైతులు కూడా అవసరం మేరకే యూరియా కొనుగోలు చేసి కృత్రిమ కొరత సృష్టించకుండ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్ సొసైటీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తరగతిలో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ చూపాలని మండల విద్యాధికారి మధు పేర్కొన్నారు. స్థానిక మండల వనరుల కేంద్రంలో మంగళవారం ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజన్న పాల్గొన్నారు

బీఆర్ఎస్ సత్తా చాటాలి

వెల్గటూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ ఎస్ సత్తా చాటేలా ప్రతీ బీఆర్ఎస్ కార్యకర్త పని చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంచంద్రం గౌడ్ పిలుపునిచ్చారు. మండలంలోని వెంకటాపూర్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ పదవుల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జూపాక కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కోరుట్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను వెంటనే పరిష్కారించాలని కోరుతూ మంగళవారం ఆర్టీసీ ఉద్యోగులు ఆర్టీసీ డీఎంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో కేవీ స్వామి, ఎస్ కిషన్‌రావు, దేవన్న, శేఖర్, ప్రతాప్‌సింగ్ ఉన్నారు.

సంకటహర చతుర్థి వేడుకలు

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం సంకటహర చతుర్థి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆలయంలో గణపతి, సుబ్రమణ్యం, అయ్యప్ప స్వామి, పంచముఖ ఆంజనేయ స్వామి వారిని దర్శనం చేసుకొన్నారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఉదయం అర్చకులు అశోక్ శర్మ,సాగర్ శర్మలు ఆలయంలో గణపతి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు దోమ్మటి ప్రవీణ్, ఉపాధ్యక్షుడు అంకతి భరత్ కుమార్, కోశాధికారి బండారి మారుతి,కార్యదర్శి చిలమంతుల శివ, పడిగెల నరేందర్, జిందం శ్రీనివాస్, రోషం బాలు, గుండా లవకుమార్, పడిగెల నరేష్, బండారి విజయ్, ర్యాగల శ్రీనివాస్, గంప రాజేష్, ర్యాగల కనకసోమేశ్వర్, ర్యాగల లక్ష్మణ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.